సాక్షి సంగారెడ్డి

గురువారం । 5 । అక్టోబర్ । 2023



తండాల అభివృద్ధికి పెద్దపీట

గిరిజన తండాల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమయ్యాయని గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

వివరాలు 8లో ▸

లాకర్ అందజేత

మల్లికార్జున స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన మాజీ ధర్మకర్త ఎర్రగొల్ల మల్లేశ్ లాకర్ బహూకరించారు.

వివరాలు 8లో ▸





అధికారుల తీరుపై ఆగ్రహం

సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అథ్లెటిక్స్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జిన్నారం(పటాన్‌చెరు): కరీంనగర్‌లో నిర్వహించిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో జిన్నారం మండలంలోని బొల్లారంలో గల తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ వివరాలు తెలిపారు. వివిధ స్థాయిల పరుగు పందెం పోటీల్లో సంధ్య, సాయి ప్రవళిక, పావని, శ్రీలత, వైష్ణవి, యమున, రేణుక, అక్షిత్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీల్లో అల్లైఖ్య, చైత్ర, యశ్వంత్, శశి ప్రతిభను కనబర్చారు. తమ విద్యార్థులు సౌత్ జోన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చటం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థులను అభినందించారు.

31న ఫోక్ డ్యాన్స్ పోటీలు

సంగారెడ్డి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి ఫోక్ డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. పోటీలు ఈనెల 31వ తేదీన జిల్లా సైన్స్ కేంద్రం సంగారెడ్డిలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 8, 9వ తరగతి విద్యార్థులు పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. నాలుగు నుంచి ఆరుగురు విద్యార్థులను గ్రూపు చేయాలన్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లభాషల్లో ఐదు నుంచి ఆరు నిమిషాల వ్యవధిలో డ్యాన్స్ ప్రదర్శించాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గ్రూపులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి టౌన్: ఇన్‌పుట్ డీలర్ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. బుధవారం సంగారెడ్డిలో డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ఇన్ ఇన్‌పుట్ డీలర్ శిక్షణా తరగతులను అధికారులతో కలిసి ప్రారంభించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 80 మంది విద్యార్థులకు రెండు బ్యాచ్‌ల్లో 40 రోజులపాటు శిక్షణ ఇస్తారన్నారు. వారానికి ఒక రోజు థియరీ క్లాస్ మిగిలిన రోజులలో ఫీల్డ్ విజిట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు సముచిత స్థానమేదీ?



మహాగర్జన ర్యాలీలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

గజ్వేల్‌రూరల్: జనాభాలో అధికంగా ఉన్న ముదిరాజ్‌ల పట్ల రాజకీయ పార్టీలు చిన్నచూపు చూడడం తగదని, ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలని, చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమ హక్కుల సాధన కోసం గజ్వేల్ పట్టణంలో బుధవారం మహాగర్జన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం జేఏసీ నాయకులు పిట్ల నాగేష్, బైరీ శంకర్, పిట్ల ఆంజనేయులు, రాయపోల్ జెడ్పీటీసీ యాదగిరి, న్యాయవాది రమేశ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు జానాభా ప్రాతిపదికన సీట్లను కేటాయించడం లేదని మండిపడ్డారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని పోరాటం చేస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. చేపల పెంపకంతో జీవనోపాధి పొందుతున్న ముదిరాజ్‌లకు చెరువులు, కుంటలపై ముదిరాజ్‌లకు పూర్తి హక్కులు కల్పించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. ఇప్పటికైనా స్పందించి ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ముదిరాజ్‌ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల సింహగర్జన ర్యాలీకి బీసీ ఐక్యవేదిక నాయకులు భాస్కర్, సింగం సత్తయ్య, మల్లేశం, ఐలయ్య, భిక్షపతి తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన ముదిరాజ్ ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పస్తులకు ఇక బ్రేక్

సర్కారు బడుల్లో అల్పాహార పథకం

- 6న నియోజకవర్గానికి ఒక పాఠశాలలో ప్రారంభం
- దసరా తర్వాత అన్ని పాఠశాలల్లో అమలు
- జిల్లాలో 1,265 పాఠశాలలు
- 1.30 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి



నారాయణఖేడ్: మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులు

నారాయణఖేడ్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా అల్పాహారం అందించనుంది. ఈమేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా ఈనెల 6వ తేదీ నుంచి పథకం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని నియోజకవర్గ కేంద్రంలోని ఎంపిక చేసిన ఓ పాఠశాలలో ఎమ్మెల్యేలు, అధికారులు పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. దసరా నుంచి జిల్లాలోని మొత్తం పాఠశాలల్లో పథకం ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం' అమలుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశంలో తొలిసారిగా ఈ పథకాన్ని తమిళనాడు రాష్ట్రంలో అక్కడి సర్కారు ప్రారంభించగా, ఈ పథకాన్ని అమలు చేయనున్న రెండో రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుంది. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,265 ఉండగా, ఇందులో 1.30 లక్షల వరకు విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ దసరా నుంచి 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం' అందనుంది.

జిల్లాలో ఐదు పాఠశాలల్లో ప్రారంభం

జిల్లాలోని ప్రతీ నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పన పథకాన్ని ఈనెల 6న ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభిస్తారు. ఇందుకుగాను జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో పోతిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల, నారాయణఖేడ్‌లో బాలికల ఉన్నత పాఠశాల, జహీరాబాద్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జోగిపేటలో బాలుర పాఠశాల, తెల్లాపూర్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పథకాన్ని ప్రారంభించేందుకు ఎంపికచేసి ఈమేరకు ఏర్పాట్లు చేపట్టారు.

పేద విద్యార్థులకు ఉపయుక్తం

సంగారెడ్డి జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1.30 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ తాజా పథకం కింద లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పిల్లలు అత్యధికులు పేదవర్గాలు ఉండడం, వారి తల్లిదండ్రులు ఉదయమే కూలీ, పొలం తదితర పనులకు వెళుతుంటారు. దీంతో చాలా మంది పిల్లలు ఉదయం అల్పాహారం తీసుకోకుండానే పాఠశాలకు వస్తున్నారు. ఫలితంగా రక్తహీనత, పోషకాహారలోపం సమస్యలు వారిని బాధిస్తున్నాయి. కొందరు తరగతి గదుల్లో నీరసంగా అనాసక్తి కనబరుస్తున్నారు. చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నారు. దీంతో ఉదయం పౌష్టికాహారం అందడంలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి రాగిజావ అందజేయడంతోపాటు మధ్యాహ్న భోజనం మెనులో వెజిటబుల్ బిర్యానీ అందజేస్తున్న ప్రభుత్వం తాజాగా అల్పాహార పథకానికి శ్రీకారం చుట్టింది. అల్పాహారంలో త్వరగా, సులభంగా వండగలిగేలా ఉన్న పొంగలి, కిచిడీ, సేమియా ఉప్మా, రవ్వ లేదా గోధుమ ఉప్మా లాంటివి అందించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఏరోజు ఏరకమైన అల్పాహారం అందించాలనే మెనుపై ఇంకా ప్రభుత్వం స్పష్టత రాలేదు.

ఖాళీ కడుపుతోనే పాఠశాలకు వస్తా..



సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం బాగుంటుంది. నారాయణఖేడ్ నుంచే పాఠశాలకు వస్తున్నా. ఉదయం అల్పాహారం చేయకుండా ఖాళీ కడుపుతోనే వస్తున్నా. మా అమ్మా, నాన్న ఉదయం పనులకు వెళ్తారు. ఇంట్లో ఏం తినకుండానే వస్తుంటా. ఒక్కోసారి నీరసంగా ఉంటుంది.

– శ్రీలేఖ, 9వ తరగతి, నారాయణఖేడ్

ఆకలి తట్టుకోలేక జామకాయ కొంటా



మాది మండలంలోని సంజీవన్‌రావుపేట. అక్కడ నుంచి ఉదయం 7.30 గంటలకు ఆటోలో బయలు దేరి నారాయణఖేడ్ పాఠశాలకు 8.30 గంటల వరకు వస్తా. అమ్మా, నాన్న పొలం పనులకు వెళ్తారు. ఏం తినకుండానే రావడంతో ఆకలి వస్తే పాఠశాల వద్ద జామకాయ కొనుక్కొని తింటా.

– లావణ్య, 8వ తరగతి, సంజీవన్‌రావుపేట

చద్దన్నం తింటా



ఉదయం చద్దన్నం ఉంటే తిని పాఠశాలకు వస్తాను. కొన్ని సార్లు తినకుండా వస్తాను. ఉదయం 7 గంటలకు పిప్రి నుంచి బస్సులో బయలు దేరి పాఠశాలకు 8 గంటల వరకు వస్తాను. స్కూల్‌లో బ్రేక్‌ఫాస్ట్ పెడితే బాగుంటుంది.

– సరోజిని, 8వ తరగతి, పిప్రి

ఎంపిక పూర్తి



'సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం' జిల్లాలోని నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పు ఎంపిక చేసి ఈనెల 6వ తేదీన ప్రారంభిస్తున్నాం. ఇది వరకే పాఠశాలల ఎంపిక పూర్తయ్యింది. దసరా తర్వాత అన్ని పాఠశాలల్లో పథకం అమలు అవుతుంది.

– ఎస్.వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

రహదారుల విస్తరణతో అభివృద్ధి



పాశమైలారంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్ చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు విస్తరిస్తున్నామని, దీంతో అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ, పాశమైలారం, బచ్చు గూడెం, పెద్దకంజర్ల గ్రామాలలో పర్యటించి రూ.28 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, నిర్మాణాలు పూర్తయినవాటికి ప్రారంభోత్సవాలు చేశారు. బతుకమ్మ పండగ పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం ఏటా మహిళల కోసం అందించే బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని తొలిరోజు నందిగామ, పాశమైలారం, బచ్చుగూడెంలలో ప్రారంభించి చీరలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు ఎమ్మెల్యేకు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ సుష్మ శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఎంపీడీఓ బన్సీలాల్, సీఐ లాలు నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఉమావతి గోపాల్,కృష్ణ, సుమతి, నరసింహ, రాజ్ కుమార్, నారాయణరెడ్డి, ఎంపీటీసీలు నాగజ్యోతి, మమత, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, దశరథ్ రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లన్నకు ఐటీ సెగ

- దేవాలయానికి నోటీసులు
- 1995 నుంచి ఐటీ రిటర్న్‌లు అందజేయని అధికారులు



కొమురవెల్లి దేవాలయం ముఖద్వారం

సాక్షి, సిద్దిపేట: ఐటీ అధికారులు కొమురవెల్లి దేవాలయానికి నోటీసులు జారీ చేశారు. రూ.11కోట్లు పన్ను చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం. గడువు ముగిసినా రిటర్న్‌లు, 12ఏ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో నోటీసులు జారీ చేసింది. ప్రతీ ఏడాది మూడు నెలల పాటు జాతర జరుగుతుంది. అలాగే సంవత్సరమంతా బుధ, ఆదివారాల్లో భక్తులు ఎక్కువ సంఖ్యలో కొమురవెల్లికి వస్తారు. ప్రతీ ఏడాది హుండీలో భక్తులు వేసే కానుకలు, టెండర్లు, పట్నాలు, బోనాలు, అభిషేకాలు, కల్యాణం, ప్రత్యేక దర్శనం తదితర వాటి నుంచి రూ.30 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. వీటి ద్వారా దేవాలయం అభివృద్ధి పనులు, ఉద్యోగుల జీతాలు, ఇతర వాటికి వినియోగిస్తారు. ఆదాయపు పన్ను శాఖ నిబంధనల ప్రకారం ప్రతీ ఏడాది ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి. అలాగే ధార్మిక సంస్థలు ఆదాయపు పన్ను శాఖలో 12ఏ రిజిస్ట్రేషన్ చేస్తే ఆదాయపు పన్ను నుంచి దేవాలయానికి మినహాయింపు ఉంటుంది. ఇప్పటి వరకు 12ఏ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఐటీ నోటీసులు పంపించారు. 1995 నుంచి ఐటీ రిటర్న్‌లు ఆదాయపు పన్ను శాఖకు అందించకపోవడంలో దేవాలయ అధికారుల నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తోంది. కొందరు ఉద్యోగులు కొన్నేళ్ల నుంచి ఇక్కడే తిష్ట వేసి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

కమిషనర్‌కు లేఖ రాశాం

ఐటీ నోటీసులు వచ్చాయి. కొన్నేళ్లుగా ఐటీ రిటర్న్‌లు చేయకపోవడంతో నోటీసులు ఇచ్చారు. 1995 నుంచి ఐటీ రిటర్న్‌లు కావాలని ఆదాయపు పన్ను శాఖ అడిగారు. ఆడిట్ వివరాలను అడుగుతున్నారని కమిషనర్‌కు లేఖ రాశాం. ఆడిటర్ ద్వారా రిప్లై ఇచ్చాం. 12ఏ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేస్తాం.

– బాలాజీ, ఇన్‌చార్జి ఈఓ

మోసపూరిత మాటలు నమ్మొద్దు

జెడ్పీచైర్‌పర్సన్ మంజూశ్రీ, ఎమ్మెల్యే క్రాంతి



గట్‌పల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంజూశ్రీ, క్రాంతి కిరణ్

వట్‌పల్లి(అందోల్): పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండి బీఆర్ఎస్ పార్టీని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని జెడ్పీచైర్‌పర్సన్ మంజూశ్రీ, ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న పనులకు శంకుస్థాపనలు, నిర్మాణాలు పూర్తయినవాటికి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ చేపడుతున్న చర్యలు చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారన్నారు. ఇతర పార్టీల నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దని, మరోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌టీపీసీ చైర్మన్ భిక్షపతి, ఎంపీపీ కృష్ణవేణి, వైస్‌చైర్మన్ నాగరాణి, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, డైరెక్టర్ బుద్దిరెడ్డి, సర్పంచ్‌లు నందిని, దీప్లానాయక్, నవనీత, నారాయణగౌడ్, ఎంపీటీసీలు నర్సింలు, కవిత తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు ఫస్ట్.. ఖేడ్ లాస్ట్

ఓటరు తుది జాబితా

అసెంబ్లీ నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జెండర్	మొత్తం
నారాయణ్‌ఖేడ్	1,14,570	1,12,654	8	2,27,232
అందోల్ (ఎస్సీ)	1,20,572	1,24,133	5	2,44,710
జహీరాబాద్ (ఎస్సీ)	1,33,312	1,31,419	1	2,64,732
సంగారెడ్డి	1,18,265	1,20,037	34	2,38,336
పటాన్‌చెరు	1,96,357	1,84,514	77	3,80,948
మొత్తం	6,83,076	6,72,757	125	13,55,958

- పురుషులు 6.83 లక్షలు, మహిళలు 6.72 లక్షలు,
- యువ ఓటర్లు 43 వేలు
- వందేళ్లు దాటిన ఓటర్లు 182 మంది
- మొత్తం ఓటర్ల సంఖ్య 13.55 లక్షలు

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఓటరు తుది జాబితాను బుధవారం అధికారులు విడుదల చేశారు. నియోజకవర్గాల వారీగా జాబితాను రూపొందించారు. ఈ జాబితాలో పేర్లు ఉన్నవారు రానున్న ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇక జిల్లాలో మొత్తం 13.55 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 6.83 లక్షల మంది పురుషులు, 6.72 లక్షల మంది మహిళలు ఉన్నారు. 125 మంది థర్డ్ జెండర్ ఓట్లు ఉన్నాయి. ఇందులో సర్వీసు ఓటర్లు 354 మంది ఉన్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లు 74 మంది ఉన్నారు. కాగా జిల్లాలో అత్యధికంగా పటాన్‌చెరువు నియోజకవర్గంలో 3.80 లక్షల మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో 2.27 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.

వయస్సుల వారీగా..

జిల్లాలో 30 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఓటర్లు 4.29 లక్షల మంది ఉన్నారు. అలాగే 40 నుంచి 49 ఏళ్ల వయస్సు ఉన్న వారు 2.68 లక్షల మంది, 50 నుంచి 59 ఏళ్ల వయస్సున్న వారు 1.69 లక్షల మంది ఉన్నట్లు గుర్తించారు.

యువ ఓటర్లు

జిల్లాలో యువ ఓటర్లు 43,684 మంది ఉన్నారు. వీరంతా 18, 19 సంవత్స రాల వయస్సున్న వారే. కొత్తగా ఓటరుగా నమో దు చేసుకున్న వీరంతా ఈసారి ఎన్నికల్లో తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

శతాధిక వృద్ధులు

జిల్లాలో వందేళ్ల దాటిన ఓటర్లు మొత్తం 182 మంది ఉన్నట్లు తేలింది. 100 నుంచి 109 ఏళ్ల వయస్సు వారు 113 మంది ఓటర్లు ఉండగా, ఏకంగా 120 సంవత్సరాలకు పైబడిన వృద్ధులు 69 మంది ఉన్నట్లు తేలింది.

స్వచ్ఛ సంగారెడ్డిగా మారుస్తా

- దశలవారీగా అభివృద్ధి పనులు
- కుక్కల బెడద అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు
- సాక్షి ఫోన్‌ఇన్‌లో మున్సిపల్ కమిషనర్ సుజాత



సాక్షి ఫోన్ ఇన్

సంగారెడ్డి మున్సిపాలిటీ : మున్సిపాలిటీలో పలు సమస్యలు నా దృష్టికి వచ్చాయి. నేను బాధ్యతలు తీసుకొని రెండు నెలలే అయ్యింది. జిల్లా కేంద్రం కావడంతో సమస్యలు ఎక్కువగానే ఉన్నాయి. త్వరలో వాటిని దశల వారీగా పరిష్కరిస్తా. మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా. ప్రజలు, వ్యాపారులు చెత్త ఎక్కడ పడితే అక్కడ పారబోయొద్దు. అప్పుడే స్వచ్ఛ సంగారెడ్డిగా మారుతుంది. పట్టణంలో దోమల బెడద లేకుండా చేసేందుకు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులతో ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. బుధవారం సాక్షి 'ఫోన్ ఇన్' కార్యక్రమంలో పట్టణ ప్రజలు స్థానిక సమస్యల పరిష్కరించాలని కోరగా సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాత సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

చింతల్ నుంచి రాజంపేట వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చెత్తా చెదారం పారబోస్తున్నారు. చెత్త పేరుకు పోయి దోమల బెడద, దుర్గంధంతో అల్లాడుతున్నాం. చెత్తపారబోసే చోట చెత్త వేయకూడదని బోర్డులు ఏర్పాటు చేయండి మేడమ్.

– సాయి, గీతానగర్

కమిషనర్: చెత్త పారబోసే ప్రాంతాల ప్రజలకు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదని వారికి అవగాహన కల్పిస్తాం. బడ్జెట్ ఉన్న చోట రోడ్లు నిర్మిస్తాం. ఇవి దశలవారీగా జరుగుతాయి.

కుక్కల బెడద అధికంగా ఉంది.

– రాహుల్, ఆదిత్య నగర్

కమిషనర్: కుక్కల బారినుంచి కాపాడేందుకు మున్సిపల్ నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టాం. వాటికి టీకాలు వేయిస్తున్నాం.

డ్రైనేజీ సమస్యతో బాధపడుతున్నాం.

– మోహన్ రెడ్డి, గణేష్ నగర్

కమిషనర్: డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం. మున్సిపల్ ఇంజనీరింగ్ దృష్టికి తీసుకెళ్లి అవసరమున్న చోట డ్రైనేజీలు ఏర్పాటు చేస్తాం.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్నారు. చర్యలు తీసుకోండి.

– విష్ణు వర్ధన్ రెడ్డి, రాంనగర్

కమిషనర్: ధూమపానం అరికట్టేందుకు మున్సిపల్ తరఫున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. సిబ్బందికి, ప్రజలకు త్వరలో కౌన్సెలింగ్ ఇస్తాము. స్మోకింగ్ చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

ఇంత వరకు దోమల నివారణకు ఫాగింగ్ చేయలేదు. దోమకాటుతో అనారోగ్యానికి గురవుతున్నాం.

– మహేష్, 11వ వార్డు

కమిషనర్: పట్టణంలో 38 వార్డులు ఉండటంతో దోమల బెడద అధికంగా ఉందని మా దృష్టికి వచ్చింది. త్వరలో ప్రతీ వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

కొన్ని కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. రాకపోకలు సాగించేందుకు చాలా ఇబ్బందిపడుతున్నాం.

– రమేశ్ కుమార్, 32 వ వార్డు

కమిషనర్: ఎస్‌డీఎఫ్ నిధుల కింద పట్టణంలోని అన్ని రోడ్లకు మరమ్మతులు, నూతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించాం. చాలా చోట్ల రోడ్లు వేస్తున్నారు.

డ్రైనేజ్ సమస్య అధికంగా ఉంది.

–శివశంకర్, సైన్‌రైజ్ హాస్పిటల్ రోడ్డు

కమిషనర్: సన్‌రైజ్ హాస్పిటల్ రోడ్డులో ఇటీవలే బీటీ రోడ్డు వేయించాం. త్వరలో డ్రైనేజీ నిర్మించేందుకు చర్యలు చేపట్టాం.

శిథిలమైన ఇళ్లను వెంటనే కూల్చివేయాలి. అవి ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– సజ్జత్ ఖాన్, 24వ వార్డు

కమిషనర్: ఇది వరకే పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పాత ఇళ్లను కూల్చివేయించాం. మరోసారి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పాత ఇళ్లను కూల్చివేతకు చర్యలు తీసుకుంటాం. కొందరికి ఇదివరకే నోటీసులు ఇచ్చాం.

బైపాస్‌లో బసవేశ్వర చౌక్ ఫ్లయి ఓవర్ వద్ద డ్రైనేజ్ లీకై పారుదలలేక మురుగు నిలిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

–శ్రీధర్, 32వ వార్డు

కమిషనర్: డ్రైనేజీ సమస్య మా దృష్టికి వచ్చింది. డ్రైనేజీ నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాము. డ్రైనేజీని బాగు చేయడానికి జట్టింగ్ మిషన్ పంపిస్తాం.

తరచూ కరెంటు పోతోంది. కుక్కల బెడద ఎక్కువగా ఉంది. కుక్కలు చిన్న పిల్లల వెంట పడుతున్నాయి.

–చంద్రశేఖర్, మంజీరా నగర్

కమిషనర్: కరెంటు సమస్య విద్యుత్ శాఖ చూస్తుంది. కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. వాటికి టీకాలు వే యిస్తాం.

రాత్రి వేళలో స్ట్రీట్ బల్బులు వెలగడం లేదు.

– వంశీ, రెవెన్యూ కాలనీ, రోడ్ నెంబర్ 4

కమిషనర్: మున్సిపాలిటీలో కరెంటుకు సంబంధించి ప్రత్యేక వింగ్ ఉంది. వారికి చెప్పి అన్ని కాలనీల్లో రాత్రి వేళలో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

డ్రైనేజీ సమస్య, రోడ్ల సమస్య పరిష్కరించాలి.

– పి.లింగా గౌడ్, 12 వ వార్డు

కమిషనర్: మీ కాలనీ హెచ్ఎండీ పరిధిలోకి వస్తుంది. హెచ్ఎండీ పరిధిలో వెంచర్ చేసిన వారే రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ చూడాలి. అది మున్సిపల్ పరిధిలోకి రాదు.

క్లుప్తంగా

రైల్వే స్టేషన్ ఘటనపై ఎమ్మెల్యే ఫిర్యాదు


ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం వద్ద జరిగిన ఘటనపై అడిషనల్ డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఇక్కడి ప్రజల దశాబ్దాల కలను నిజం చేశారన్నారు. రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో రైల్వే అధికారులపై మంత్రి ప్రవర్తించిన తీరు సరికాదన్నారు. ఘటన జరిగి 24 గంటలైనా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. జరిగిన ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులపై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించడం మూలంగానే సిద్దిపేట రైలు కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీరాంచక్రవర్తి, శ్రీకాంత్ రెడ్డి, ఉపెందర్‌రావు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధిశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మి మార్కెటింగ్ కంపెనీలో నాలుగు ఉద్యోగాల భర్తీ కోసం ఆరోజు ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు బైపాస్ రోడ్డులోని ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 08455 271010 లో సంప్రదించాలని కోరారు.

మల్లన్న ఆలయానికి లాకర్ అందజేత


లాకర్ బహూకరిస్తున్న మల్లేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయానికి హైదరబాద్‌కు చెందిన మాజీ ధర్మకర్త ఎర్రగొల్ల మల్లేశ్ బుధవారం లాకర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకుడు నీల శేఖర్ పాల్గొన్నారు. అలాగే ఆలయంలోని హుండీలను 12న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపుకు హాజరైయ్యే ఉద్యోగులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

'ప్రభుత్వానికి రుణపడి ఉంటాం'

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలంగాణ రేషన్ డీలర్ల కన్వీనర్, సిద్దిపేట జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు దొమ్మాటి రవీందర్ అన్నారు. మండలంలోని గురువన్నపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రధానకార్యదర్శి చంద్రం అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తమను గుర్తించి కమీషన్ రూ.90 నుంచి రూ.140కి పెంచడం శుభ పరిణామం అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూడెం కృష్ణారెడ్డి, మేకల యాదగిరి, ఆయా మండలాల రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి పెద్దపీట

- గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- 1,008 గురుకులాలు 7 లక్షల మంది విద్యార్థులు


అక్కన్నపేటలో గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజన తండాల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమయ్యాయని గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. అక్కన్నపేటలో బుధవారం బంజారా ఆత్మీయ సమ్మేళనం సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలకు దూరంగా ఉన్న తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన చరిత్ర సీఎం కేసీఆర్‌కే దక్కిందని, ఆయన వెంటే గిరిజనులంతా నడవాలన్నారు.

అదనపు గదులకు భూమి పూజ

హుస్నాబాద్‌రూరల్: దళిత, గిరిజన విద్యకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రతి ఏటా విద్యపై సగటున రూ.9 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని మంత్రి సత్యావతిరాథోడ్ అన్నారు. బుధవారం జిల్లెలగడ్డలోని గిరిజన బాలుర గురుకులం, కళాశాలలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించే అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణలో 1,008 గురుకులాలను ఏర్పాటు చేశారని, తద్వారా సుమారు 7 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. కార్పొరేటు విద్యా సంస్థలకు ధీటుగా విద్యా బోధన జరుగుతోందని, గురుకులాల్లో కూడా ఐఐటీ, నీట్ కోచింగ్‌లు ఇవ్వడం వల్ల విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు అవుతున్నారని చెప్పారు. గిరిజనులు అందరూ తమ పిల్లలను గురుకులంలోనే చదివించాలని సూచించారు. అక్కన్నపేట గిరిజన బాలికల గురుకులం కోసం రూ.12 కోట్లు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి భోజన ఫీజులను 25 శాతం పెంచామన్నారు. విదేశీ విద్య కోసం కూడా ప్రభుత్వం రూ.20 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందని ఆమె తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్య వల్లనే ప్రయోజకులవుతారనే ఆలోచనతోనే సీఎం గురుకులాలను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో హన్మకొండ జిల్లా జెడ్పీ చైర్మన్ సుధీర్‌బాబు, సిద్దిపేట జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యులు భూక్య మంగ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రజని, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావు పర్యటనకు ఏర్పాట్లు



జహీరాబాద్: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి టి.హరీశ్ రావు 7న నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు చెందిన ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌ను బుధవారం సందర్శించి సభ నిర్వహణ కోసం చేయాల్సిన ఏర్పాట్లను అధికారులకు అప్పగించారు. అల్గోల్ రోడ్డులో హెలికాప్టర్ దిగేందుకు వీలుగా ఉన్న స్థలాలను పరిశీలించారు. హోతి(కె) గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిర్వహించే సభకు ఏర్పాట్ల గురించి అధికారులకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, బ్రూవరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, ఆర్డీవో వెంకారెడ్డి, డీఎస్పీ రఘు, సీఐ రాజు తదితరులు ఉన్నారు.

ఐవోసీకి తరలని కార్యాలయాలు

- ఆసక్తి చూపని అధికారులు
- నిరుపయోగంగా గదులు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు


ఐవోసీ భవనం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్స్‌ను సెప్టెంబరు 16న ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సముదాయంలో ఆర్డీవో, తహసీల్దార్, ఈఈ కాళేశ్వరం, ఎస్టీవో, అటవీశాఖ, డీఎల్పీవో, డీఈ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ రెగ్యులర్‌తో పాటు డివిజనల్ వ్యవసాయశాఖ కార్యాలయాలకు గదులు కేటాయించారు. అయితే ఐవోసీని ప్రారంభించి సుమారు ఇరవై రోజులు కావస్తున్నా అన్ని కార్యాలయాలు అక్కడికి తరలించలేదు. కేవలం ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలు మాత్రమే అక్కడ ప్రజలకు సేవలందిస్తున్నాయి. ఇతర కార్యాలయాలు ఐవోసీలో చేర్చేందుకు అధికారులు వెనుకాడుతున్నారు. విద్యుత్ సమస్య, ఇంటర్‌నెట్ సిగ్నల్ లేకపోవడం వంటి సమస్యల వల్ల అధికారులు ఆసక్తి చూపించడం లేదని సమాచారం. ప్రజలకు ఒకే దగ్గర ప్రభుత్వ సేవలు అందించాలని సీఎం కేసీఆర్ రూ.21 కోట్ల వ్యయంతో భవనం నిర్మిస్తే అధికారులు కార్యాలయాలను తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ పనుల కోసం ఇతర కార్యాలయాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు దూరంలోని హుస్నాబాద్‌కు రావాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి కార్యాలయాలను ఐవోసీకి తరలించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

వృద్ధుల హక్కులపై అవగాహన


మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: రక్షణ, హక్కులపై వయోవృద్ధులకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జె.హనుమంతరావు అవగాహన కల్పించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమం, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వయోవృద్ధులు తమకు నచ్చిన విధంగా బతకాలన్నారు. అనంతరం వయోవృద్ధుల రక్షణ, హక్కుల గురించి అవగాహన కల్పించారు. జిల్లాలో నాలుగు సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్స్ ఉన్నాయని, ఏ ఇబ్బంది కలిగినా హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 14567 ను సంప్రదించాలని కోరారు.ఈ సందర్భంగా సామాజిక సేవలు అందిస్తున్న పదిమంది వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి సంధ్యారాణి, డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ గాయత్రి దేవి, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

హుందాగా రాజకీయాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి


మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేసేందుకు వెళుతున్న బీజేపీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజాక్షేత్రంలో ఉన్నపుడు హుందాగా రాజకీయాలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నూతన రైల్వేలైన్‌ను ప్రారంభించే సమయంలో జరిగిన ఘటనను నిరసిస్తూ బీజేఆర్ చౌరస్తాలో మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం చేయడానికి గురువారం బీజేపీ నాయకులు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట ప్రజల కలైన రైల్వే లైనును ప్రధాని మోదీ ప్రభుత్వం సాకారం చేస్తుంటే అభినందించాల్సింది పోయి అడ్డగోలుగా ప్రవర్తించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిగా ఉంటూ కార్యకర్తలను రెచ్చగొట్టడం, అధికారులపై దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఘర్షణకు కారణమైన మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉపేందర్ రావు, ఉడుత మల్లేశం, కొత్తపల్లి వేణుగోపాల్, బూరుగు సురేష్ గౌడ్, కోడూరి నరేష్, రోశయ్య, తొడుపునూరి వెంకటేశం పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి పట్టం : వంటేరు


పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): అభివృద్ధి మా హక్కు.. ఓట్లు వేసే హక్కు మీదేనని, పల్లెల అభివృద్ధికి పట్టం కట్టిన సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ. 4.27 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులు, పంచాయతీ భవనాలు, మహిళా భవనాలు, అంగనగ్‌వాడీ కేంద్రాలను వారు బుధవారం ప్రారంభించారు. అలాగే రూ.కోటి 20 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతకు ఉపాధి కోసం మునిగడప గ్రామంలో 400 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ ప్రారంభమైందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఇక్కడి యువతకు ఉపాధి ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పల్లెలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. నేటి నుంచి గృహలక్ష్మి పథకం ప్రారంభం అవుతుందని, అర్హులందరికీ పథకం అందిస్తామని తెలిపారు. బస్వాపూర్ గ్రామంలో తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీపీ బాలేషంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు భగవాన్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ రంగారెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చాక్లెట్‌లో పురుగులు

- బేకరీలో మున్సిపల్ అధికారుల తనిఖీ
- పరిశీలించి కొనుగోలు చేయాలి


విచారిస్తున్న మున్సిపల్ అధికారులు

చేర్యాల(సిద్దిపేట): స్థానికంగా ఉన్న ఒక బేకరీలో కొనుగోలు చేసిన చాక్లెట్‌లో పురుగులు వచ్చాయని ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం మున్సిపల్ అధికారులు తనిఖీ నిర్వహించారు. బేకరీలో ఎలాంటి పాడైన చాక్లెట్లు, తినుబండారాలు కనిపించలేదని అధికారులు తెలిపారు. వినియోగదారులు పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు.

భూ పరిహారం ఏది?

కొండపాక(గజ్వేల్): తపాస్‌పల్లి రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన వారికి పరిహారం అందేలా చూడాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ముంపు బాధితులు బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. కుకునూరుపల్లి మండలంలోని శివారు ప్రాంతాల్లో భూములు కోల్పోయారని, పూర్తి పరిహారం అందించలేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ వాపోయారు. పరిహారం అందజేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన బాలికల క్రీడా పోటీలు

- అండర్ 19 పోటీలలో ప్రతిభ
- ఓవరాల్ చాంపియన్ వర్గల్


ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన వర్గల్ బాలికలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ జ్యోతిబా పూలే గురుకులం వేదికగా రెండు రోజుల పాటు కొనసాగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–19 బాలికల ఆటల పోటీలు బుధవారంతో ముగిశాయి. ఆటల పోటీలలో వర్గల్ పూలే గురుకుల బాలికలు ఉత్తమ ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. విద్యార్థిని శ్రావణి వ్యక్తిగత చాంపియన్‌షిప్ దక్కించుకుంది. విజేతలకు నవోదయ ప్రిన్సిపాల్ డి.రాజేందర్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆతిథ్య గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు మౌనిక, చంద్రిక పాల్గొన్నారు. వాలీబాల్‌లో వర్గల్, ముత్తంగి గురుకుల బాలికలు, ఖోఖోలో వర్గల్, దుబ్బాక, కబడ్డీలో జోగిపేట, వర్గల్, టెన్నికాయిట్‌లో వర్గల్, ముత్తంగి బాలికలు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు.

వేర్వేరు సంఘటనల్లో నలుగురు మృతి


చెరువులో పడి మృతి చెందిన లక్ష్మి

పాపన్నపేట(మెదక్): చెరువులో పడి అనుమానస్పద స్థితిలో ఒక మహిళ మృతి చెందిన ఘటన మల్లంపేట గ్రామంలో చోటుచేసుకుంది. టేక్మాల్ మండలం ఎల్లుపేటకు చెందిన లక్ష్మి(30)కి మల్లంపేటకు చెందిన నాగరాజుతో గతంలో వివాహం జరిగింది. భార్యభర్తలు తరుచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గొడవ జరిగి లక్ష్మి ఇంట్లోంచి వెళ్లిపోయింది. అయితే బుధవారం లక్ష్మి మృతదేహాన్ని స్థానికులు చెరువులో గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి లక్ష్మి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

ప్రమాదవ శాత్తు చెరువులో పడి..


చెరువులో మునిగి మృతి చెందిన తిరుపతి

సిద్దిపేటఅర్బన్: కాలకృత్యాల కోసం వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయిన ఘటన మండలంలోని ఎన్సాన్‌పల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల తిరుపతి (33) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తిరుపతి కాలకృత్యాలు తీర్చుకోవడానికని వెళ్లి ఉదయం అయినా రాకపోవడంతో దగ్గరి బంధువులు గాలించగా చెరువులో మృతదేహాన్ని గమనించారు. భార్య స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో వృద్ధురాలు..

కల్హేర్(నారాయణఖేడ్): కరెంట్ షాక్‌తో వృద్ధురాలు మరణించిన ఘటన సిర్గాపూర్ మండలం పోచాపూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లో కరెంట్ తీగలు తెగి ఇనుప డోర్‌పై పడడంతో గ్రామానికి చెందిన ఎండి. రహనాబీ(56) విద్యుత్ షాక్‌కు గురైంది. కుటుంబీకులు నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రహనాబీ మృతి చెందింది.

చికిత్సపొందుతూ జర్నలిస్టు మృతి


నాగయ్య(ఫైల్)

జహీరాబాద్: సీనియర్ జర్నలిస్టు నాగయ్య(45) రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ బుధవారం ఆస్పత్రిలో మరణించాడు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. ఝరాసంగం మండలంలోని ప్యాలవరం గ్రామానికి చెందిన నాగయ్య గత 22 రాత్రి స్వగ్రామానికి మోటారు బైక్‌పై వెళుతూ పస్తాపూర్ గ్రామ శివారులోని నారింజవాగు వంతెన వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మరణించాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని అన్నాసాగర్ చెరువు తూము వద్ద గుర్తు మృతదేహం లభ్యమైంది. జోగిపేట ఎస్‌ఐ గైపప్పా తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం గ్రామస్తులు చెరువులో గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వయస్సు సుమారుగా 30 ఏళ్లు ఉంటుందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు


గాయపడిన రామాచారి, దీప్తి

నర్సాపూర్ రూరల్: బైక్‌ను బొలెరో వాహనం ఢీ కొట్టడంతో భార్యాభర్తలు గాయపడిన ఘటన నర్సాపూర్ – మెదక్ రహదారిలో చిన్న చింతకుంట సమీపంలో చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన రామాచారి అతడి భార్య దీప్తి బుధవారం బైక్‌పై నర్సాపూర్ మీదుగా మెదక్ వైపు వెళ్తుండగా చింతకుంట వద్ద వారిని బొలెరో వాహనం ఢీకొట్టింది. గాయపడిన వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యుత్ షాక్‌తో..

నర్సాపూర్ రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు గాయపడిన ఘటన స్థానిక బస్టాండ్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. బస్టాండ్ వద్ద ఉన్న భవన యజమాని కపాచారి, ముగ్గురు పెయింటర్లతో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనాన్ని ఆనుకుని ఉన్న విద్యుత్తు లైన్‌ను తాకడంతో కొడిపల్లి మండలం రాజుపేటకు చెందిన పెయింటర్ మలోత్ సయ్యకు విద్యుత్ షాక్ తగిలింది. అతడిని కాపాడడానికి ప్రయత్నించిన కపాచారి కూడా షాక్‌కు గురయ్యాడు. ఇద్దరినీ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరూ చికిత్స పొందుతున్నారు.


షాక్‌కు గురైన మాలోత్ సయ్య

మార్కెట్‌కి వెళ్లి.. మహిళ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: మార్కెట్‌కి వెళ్లిన ఒక మహిళ, మరో ఘటనలో వేరొక బాలిక అదృశ్యమయ్యారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం మధ్యప్రదేశ్‌కు నుంచి ఇస్నాపూర్‌కు వలస వచ్చిన శాంతిబాయి కూలీ పనిచేసుకునే జీవనం సాగిస్తోంది. ఈ నెల రెండో తేదీన మార్కెట్‌కని వెళ్లి ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో శాంతిబాయి బంధువులు, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. శాంతిబాయి అదృశంపై బంధువు సందీప్ ఫిర్యాదు చేయగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఛత్తీస్‌గఢ్ నుంచి చిటుకుల్‌కు వలస వచ్చి కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఒక కుటుంబానికి చెందిన బాలిక మంగళవారం ఉదయం నుంచి కనిపించడంలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూత్ర విసర్జనకు వెళ్లి..

మూత్ర విసర్జనకు వెళ్లి వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి చెందిన డప్పు శ్రీనివాస్(52) కుటుంబ సభ్యులతో కలిసి బీరంగూడ గుట్టపై శివాలయంలో నిద్ర చేసేందుకు 2వ తేదీన వచ్చారు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఒకటిన్నర సమయంలో మూత్ర విసర్జనకి వెళ్లిన శ్రీనివాస్ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో శ్రీనివాస్ సోదరుడు యాదగిరి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో..

సిద్దిపేటకమాన్: భార్య భర్తలు ఇద్దరు గొడవపడి భర్త ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా సిద్దిపేట టూటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. శివరాత్రి కనకరాజు, రాజేశ్వరి తమ ఇద్దరి పిల్లలతో కలిసి పాత కేసీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. మూడు నెలల క్రితం కనకరాజు తన భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇప్పటికీ కనకరాజు ఇంటికి తిరిగి రాకపోవడ, ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కనకరాజు తల్లి కొమురమ్మ బుధవారం సిద్దిపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోంగార్డు ఆత్మహత్య


మల్లారెడ్డి (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పొట్లపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు దేవసాని మల్లారెడ్డి (54) బుధవారం తెల్లవారు జామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం మల్లారెడ్డి మంగళవారం విధులకు హాజరైన సాయంత్రం ఇంటికి వెళ్లాడు. అయితే తెల్లవారు జామున భార్య లత నిద్రలేచి బయటకు వచ్చేసరికి బాతురూమ్ పక్కనే మల్లారెడ్డి ఉరి వేసుకుని ఉండడం గమనించింది. పోలీసులకు సమాచారం అందించడంతో మృత దేహాన్ని సీఐ ప్రభుత్వ అస్పత్రికి తరలించారు.

అదనపు కట్నం వేధింపులు

పటాన్‌చెరు టౌన్: అదనపు కట్నం కోసం భర్తతో కలిసి అత్తింటివారు వేదించడంతో బాధితురాలు ఫిర్యాదు చేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిట్కుల్ గ్రామానికి చెందిన ఆశ్రవల్లిక 2019లో తిరుమలగిరికి చెందిన జాన్ ఆసీర్‌తో వివాహం జరిగింది. జాన్ ఆసీర్ కుటుంబ సభ్యులు ఆశ్రవల్లికను తరచూ చిత్రహింసలకు గరిచేసేవారు. గతంలో బంగారం దొంగిలించిందని కూడా బాధితురాలిపై కేసు పెట్టి ఉపసంహరించుకున్నారు. ఇలా వేదింపులకు గురిచేస్తున్న భర్త, అత్త మామ, ఆడపడుచులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 7207776136 [G-601132]

■ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో పార్ట్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ 25వేలు పైన సంపాదించే అవకాశం. వయస్సు : 20+, అర్హత : ఇంటర్ పైనా అందరూ అర్హులే. మరిన్ని వివరాలకు : 85001 48297 [V-797421]

■ కొత్తగా మార్కెట్‌లోకి రాబోతున్న ఆన్లైన్ డిజిటల్ ప్రాజెక్ట్ కొరకు ఆన్లైన్ బిజినెస్ మీద కొంత అవగాహన ఉన్న పార్టనర్స్ కావలెను. సంప్రదించవలిసిన నెంబర్ : 7093905887. [M-1221739]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీతం: 18K Ph: 9640400073/ 9848571888 [HA-189337]

■ రామకృష్ణ హోంకేర్ సర్వీసెస్ (AP NO-1) VJA, HYD శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవలకు వంట/ ఇంటి పని, బేబీ కేర్ వర్కర్స్ కావలెను భోజనం+వసతి+జీ :15-21 వేలు ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 86397 56217, 86397 56214 [B-1068138]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.